క్లుప్తంగా

ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలని వినతి

మిర్యాలగూడ అర్బన్‌: దామరచర్ల మండలంలో స్వాతంత్య్ర సమరయోధుల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓకు దామరచర్ల మండలంలోని దొలావర్‌పూర్‌ గ్రామానికి చెందిన ధరావత్‌ నీలకంఠ నాయక్‌, దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కొండారపు నాగేశ్వర్‌రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు రూ.500 కోట్ల విలువ చేసే వంద ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు స్వాతంత్య్ర సమరయోధుల పేరిట పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడిన విషయాన్ని గతంలోనే కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని రద్దు చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించారని పేర్కొన్నారు. కానీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన కబ్జాదారులు ఇటీవల అక్రమంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో 65మంది లబ్ధిదారులకు బుధవారం ఎంపీపీ ధనావత్‌ బాలాజీనాయక్‌ కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్‌, మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొత్త మర్రెడ్డి, ఎంపీటీసీ పేర్ల లింగయ్య, మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌ రఘు, ఎంపీడీఓ మహ్మద్‌ షరీఫ్‌, బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్‌, సర్పంచులు తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

మిర్యాలగూడ టౌన్‌: పట్టణంలోని హౌజింగ్‌ బోర్డు కాలనీలో గల లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌ విద్యార్థులు బుధవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె జయరాజన్‌ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

బీజేపీని చూస్తేనే సీఎం కేసీఆర్‌కు భయం

మిర్యాలగూడ టౌన్‌: రాష్ట్రంలో బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుందని బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్‌, సినీ నటి కవిత, అసెంబ్లీ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర నేత సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌ బాణావత్‌ రతన్‌సింగ్‌నాయక్‌ అన్నారు. బుధవారం పట్టణంలోని హౌజింగ్‌ బోర్డు, చైతన్యనగర్‌, శ్రీ వెంకటేశ్వర టెంపుల్‌ సమీపంలో జరిగిన బీజేపీ కార్నర్‌ మీటింగ్‌లో భాగంగా జరిగిన శక్తి కేంద్రాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు మూల రాజిరెడ్డి, పరంగి శ్యాం, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్‌, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత, పట్టణ అధ్యక్షులు దొండపాటి వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న బాలునాయక్‌

చింతపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్‌ బాలునాయక్‌ అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని నెల్వలపల్లి, ఉప్పరపల్లి, తిరుమలాపురం, నసర్లపల్లి, రాగ్యనాయక్‌తండా, బాలాజీతండా, గుడితండా, బోట్యతండా, రెడ్యాతండా, దేన్యతండా, లక్ష్మాతండా, గాసిరాంతండా, తీదేడు గ్రామాల్లో కాంగ్రెస్‌ శ్రేణులు పర్యటించారు. కాంగ్రెస్‌ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దొంతం సంజీవరెడ్డి, ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల నాగభూషణం, ఎంపీపీ కొండూరు భవాని, అంగిరేకుల గోవర్ధన్‌, ఎరుకలి వెంకటయ్యగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ మెస్‌ బిల్లులు విడుదల చేయాలి

మిర్యాలగూడ: సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్‌ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్‌ కార్యదర్శి కొర్ర సైదానాయక్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ చార్జీలను పెంచాలన్నారు. బిల్లులు విడుదల చేయకపోతే ఆర్డీఓ కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్‌, ఆనంద్‌, రవి, అజయ్‌కుమార్‌, రాహుల్‌, విష్ణు, రంగా, మౌనిక, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధిపై పట్టింపేదీ..?

- డిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత
- రోగులకు తాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు
- కనీసం అంబులెన్స్‌ కూడా లేని దుస్థితి

డిండి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో డిండి మండలంతో పాటు నాగర్‌కర్నూల్‌ జిల్లా పరిధిలోని వంగూరు, ఉప్పునుంతల మండలాల నుంచి ప్రతి నిత్యం వైద్యం కోసం ఈ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గత కొన్ని సంవత్సరాలుగా సిబ్బంది కొరత ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ ఒక్కరు మాత్రమే ఉండటంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలో 22 మంది ఏఎన్‌ఎంలకు గాను 13 మంది విధులు నిర్వహిస్తుండగా 9 ఖాళీలు ఉన్నాయి. స్టాఫ్‌ నర్సులు ముగ్గురికి గాను ఇద్దరు ఉన్నారు. సూపర్‌వైజర్‌ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి. అంతేకాకుండా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు తాగునీరు, సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



డిండి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అంబులెన్స్‌ సౌకర్యం కరువు..

అత్యవసర పరిస్థితుల్లో రోగులను, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించడానికి కనీసం అంబులెన్స్‌ సౌకర్యం కూడా లేక మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని వీరబోయనపల్లి, సింగరాజుపల్లి, రహమంతపూర్‌, తవక్లాపూర్‌, కందుకూర్‌, బ్రాహ్మణపల్లి, వావిల్‌కొల్‌, టి గౌరారం, కామేపల్లి, గోనబోయినపల్లి, ప్రతాప్‌నగర్‌, ఖానాపూర్‌, చెర్కుపల్లి, బొగ్గులదొన తదితర గ్రామాల ప్రజలు దాదాపు 20కి.మీ. దూరం నుంచి వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తుంటారు. ఆయా గ్రామాల ప్రజలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌ సౌకర్యం లేకపోవడంతో సమీప మండలాలైన దేవరకొండ, వంగూరు, అచ్చంపేట మండలాలకు చెందిన అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తుంది. అక్కడ కూడా అంబులెన్స్‌ అందుబాటులో లేకపోతే ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయిస్తున్నామని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డిండి పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు మండలానికి 108 అంబులెన్స్‌ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. సమస్యలను పరిష్కరించడంతో పాటు పీహెచ్‌సీలో సిబ్బంది కొరతను తీర్చాలని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎస్‌. శైలి, పీహెచ్‌సీ వైద్యాధికారి, డిండి

అంబులెన్స్‌ సౌకర్యం కల్పించాలి



డిండి మండలానికి 108 అంబులెన్స్‌ సౌకర్యం లేక మారుమూల గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి అంబులెన్స్‌ సౌకర్యం కల్పించాలి.

– మేకల సాయమ్మ, సర్పంచ్‌, డిండి

మెరుగైన సేవలు అందించాలి



మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రోగులకు మెరుగైన సేవలను అందించాలి. డిండి మండలానికి అంబులెన్స్‌ సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

– ఎనమల్ల నవీన్‌, తవక్లాపూర్‌

కాంగ్రెస్‌ నాయకుల ముందస్తు అరెస్ట్‌



మిర్యాలగూడ అర్బన్‌ పోలీస్‌ స్టేషన్‌లో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌, కాంగ్రెస్‌ నాయకులు

మిర్యాలగూడ అర్బన్‌: వరంగల్‌లో యువజన కాంగ్రెస్‌ నాయకుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడికి సిద్ధమైన స్థానిక కాంగ్రెస్‌ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కేతావత్‌ శంకర్‌నాయక్‌ మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్‌ కార్యకర్తలను అకారణంగా కొట్టడం దారుణమని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. అరెస్టయిన వారిలో పార్టీ నాయకులు బత్తుల లక్ష్మారెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, గందం రామకృష్ణ, జానీ, షేక్‌ అజారుద్దీన్‌ తదితరులున్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: దేవరకొండలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్‌, ఎండీ ఉమేర్‌, కొండ్ర సుజిత్‌, మూడావత్‌ లక్పతి, నేనావత్‌ కుమార్‌ తదితరులున్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి నేపథ్యంలో మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో యూత్‌ కాంగ్రెస్‌ నాగార్జునసాగర్‌ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల అధ్యక్షుడు కిలారి మురళీయాదవ్‌, కాటేపల్లి రవిగౌడ్‌, సలీం ఉన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కాంగ్రెస్‌ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, గడ్డం శ్రీరాములు, రమేశ్‌నాయక్‌ తదితరులున్నారు.

డిండిలో..

డిండి: మండల కాంగ్రెస్‌ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మూడావత్‌ మల్లేష్‌నాయక్‌, పున్న దినేష్‌, మూడావత్‌ భీముడు, సతీష్‌నాయక్‌, బల్మూరి సాయిబాబా, జైపాల్‌నాయక్‌, వేముల లక్ష్మయ్య తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ పాలనలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత

మిర్యాలగూడ టౌన్‌: బీఆర్‌ఎస్‌ పరిపాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కొంత మంది పోకిరీల వేధింపులు భరించలేక దేవరకొండ మండలంలోని చింతలబావి గ్రామానికి చెందిన దేవరకొండ మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి పురుగు మందు తాగడంతో బ్రెయిన్‌ డెడ్‌ అయ్యి చనిపోయిందని అన్నారు. కేసీఆర్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో బెల్టు షాపులు ఎక్కువ అయ్యాయని, యువత మద్యం మత్తుతో మహిళలను వేధిస్తున్నారని అన్నారు. లక్ష్మి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో రేణుక, ఉమ, దేవి, భాగ్యమ్మ, యాదమ్మ, నవ్య తదితరులున్నారు.

తడకమళ్లలో ఆంబోతుకు అంత్యక్రియలు

మిర్యాలగూడ టౌన్‌: మండలంలోని తడకమళ్ల గ్రామంలో బుధవారం చనిపోయిన ఆంబోతుకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. తడకమళ్ల గ్రామంలో 20ఏళ్ల క్రితం బొడ్రాయి వేశారు. ఆ సమయంలో వచ్చిన చందాలతో ఒక ఆంబోతును కొనుగోలు చేసి ఊరిపై వదిలి వేశారు. తొమ్మిది ఏళ్ల పాటు తడకమళ్ల గ్రామంలో ఉన్న ఆ ఆంబోతు ఆ తర్వాత సల్కూనూరు, ములకపట్నం, దొండవారిగూడెం, బొమ్మకల్లు, రావులపెంట, పచ్చారిగడ్డ, ఉట్లపల్లి, తక్కెళ్లపహాడ్‌, కామేపల్లి గ్రామాలతో పాటు పలు తండాలు తిరిగి 11ఏళ్ల తర్వాత 15 రోజుల క్రితం తడకమళ్లకు వచ్చింది. కాగా రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆ ఆంబోతు మంగళవారం మృతిచెందింది. దీంతో బుధవారం గ్రామస్తులు ట్రాక్టర్‌పై ఆంబోతును కళేబరాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ దేవిరెడ్డి వేమారెడ్డి, ఉప సర్పంచ్‌ చనగాని సైదమ్మ, వైస్‌ ఎంపీపీ అమరావతి, అనంతుల యాదగిరి, మాజీ సర్పంచ్‌ మారం భిక్షమయ్య, చల్లాబోట్ల నారాయణరెడ్డి, అంతిరెడ్డి, బత్తుల లింగారెడ్డి, పాలకూరి మోహన్‌ గౌడ్‌, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌పై ఆంబోతు కళేబరాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న తడకమళ్ల గ్రామస్తులు

బహుజన ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్న ప్రభుత్వం

దేవరకొండ: బహుజన ప్రజాప్రతినిధులను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విస్మరిస్తుందని బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ అన్నారు. బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే సాయన్న మృతికి సంతాపం తెలిపారు. సాయన్న అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించకపోవడంతో పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బహుజన ఎమ్మెల్యేలకు కనీస మర్యాద ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రమేశ్‌నాయక్‌, ప్రకాష్‌, కొండ లలిత, కూర శ్రీకాంత్‌, ముదిగొండ మొగులయ్య తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

వెల్లివిరిసిన మతసామరస్యం

- పీకే మల్లేపల్లిలోని అజహరత్‌ అబ్బాస్‌ దర్గా ఉర్సు ప్రారంభం
- కొండ పైన మక్కా మహేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

చింతపల్లి: మండల పరిధిలోని పీకే మల్లేపల్లిలో గల అజహరత్‌ అబ్బాస్‌ దర్గా ఉర్సుకు జనం పోటెత్తారు. మంగళవారం రాత్రి 11గంటల నుంచి బుధవారం ఉదయం 5గంటల వరకు ఒంటెపై గంధం ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. అదే విధంగా దర్గా పైన కొండపై కొలువుదీరిన మక్కా మహేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ఐఏఎస్‌ అధికారులు, ప్రజాప్రతినిధులు దర్గాను, మహేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఒకే చోట ఈ ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. నాంపల్లి సీఐ విఠల్‌రెడ్డి, చింతపల్లి ఎస్‌ఐ రమేశ్‌తో పాటు మర్రిగూడ, నాంపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి మండలాల ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక అజహరత్‌ అబ్బాస్‌ దర్గా: ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌

అజహరత్‌ అబ్బాస్‌ దర్గా మతసామరస్యానికి ప్రతీక అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. బుధవారం దర్గా వద్ద, మక్కా మహేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మాల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ దండు జగదీశ్‌, వైస్‌ చైర్మన్‌ గోపిడి కిష్టారెడ్డి, విద్యాసాగర్‌రావు, రవి, శ్రీశైలం, మల్లేశ్‌, అక్రమ్‌, గుత్తా అమిత్‌రెడ్డి, దర్గా కమిటీ చైర్మన్‌ కేవీ రమేశ్‌రాజు, సయ్యద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ ప్రార్థనలు



గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌

దేవరకొండ: తెలంగాణలో కేసీఆర్‌ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చందంపేట మండల కేంద్రానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో బీఆర్‌ఎస్‌ క్రియాశీలక పాత్ర పోషించనుందని అన్నారు. కార్యక్రమంలో ముత్యాల సర్వయ్య, దొండేటి మల్లారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, ఏర్పుల గోవిందు, గోసుల అనంతగిరి, గోసుల శివ, ముత్యం, శ్రీశైలం తదితరులున్నారు.



దేవరకొండ: కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌

‘కిష్టరాయినిపల్లి’ పనులు పూర్తిచేయాలి

చింతపల్లి: మండలంలోని కిష్టరాయినిపల్లి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ అధికారులకు సూచించారు. బుధవారం ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా కిష్టరాయినిపల్లి, చింతపల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చర్లగూడ గ్రామాలల్లో ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దేవరకొండ, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాలకు నీరందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్‌ బొడ్డు శ్రీనివాస్‌, వీరేటి మల్లేశ్‌, కుంభం శ్రీశైలం, బాదేపల్లి నిరంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ అన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కుర్రంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఘనంగా సేవాలాల్‌ జయంతి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భగత్‌, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రాష్ట్ర ట్రైకార్‌ చైర్మన్‌ రాంచందర్‌ నాయక్‌

హాలియా: అఖిల భారత బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం హాలియా పట్టణంలో సేవాలాల్‌ మహారాజ్‌ 284వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే భగత్‌, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రాష్ట్ర ట్రైకార్‌ చైర్మన్‌ రాంచందర్‌నాయక్‌ ముఖ్య అతిథులుగా హాజరై బోగ్‌ బండార్‌ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. సేవాలాల్‌ మహారాజ్‌ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. సేవాలాల్‌ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్‌, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఇరిగి పెద్దులు, జెడ్పీటీసీలు భారతి, సూర్య భాష్యానాయక్‌, ఎంపీపీలు అంగోతు భగవాన్‌నాయక్‌, పేర్ల సుమతి, చెన్ను అనురాధ, మార్కెట్‌ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వెంపటి పార్వతమ్మ, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్‌ కలాం ఆజాద్‌ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా: స్వాతంత్య్ర సమర యోధుడు మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ దేశానికి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో బుధవారం హాలియా పట్టణంలోని అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతి క్యాంపు కార్యాలయం వద్ద అబుల్‌ కలాం ఆజాద్‌ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని అబుల్‌ కలాం ఆజాద్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అబుల్‌ కలాం ఆజాద్‌ దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతి, వెనిగండ్ల సొసైటీ చైర్మన్‌ కేవీ రామారావు, వైస్‌ ఎంపీపీ మాలే అరుణ, పెద్దవూర ఎంపీపీ గౌరవ సలహాదారు చెన్ను సుందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబుయాదవ్‌, కౌన్సిల్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌, కొట్టాల సర్పంచ్‌ చింతకాయల పద్మ, శ్రీనునాయక్‌, గుంటుక మధుసూదన్‌రెడ్డి, కొట్టాల శ్రీను, అబ్దుల్‌ హలీం, అంజాద్‌ఖాన్‌, షేక్‌ మక్బూల్‌, షేక్‌ జలీల్‌ పాషా, మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్‌ గౌస్‌, ఉపాధ్యక్షుడు అస్గర్‌, కోఆప్షన్‌ సభ్యుడు షేక్‌ మున్నా తదితరులు ఉన్నారు.



అబుల్‌ కలాం ఆజాద్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు

పశువైద్య శిబిరం ప్రారంభం

నిడమనూరు: మండలంలోని నారమ్మగూడెంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే నోముల భగత్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కొండా కృష్ణవేణి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మర్ల చంద్రారెడ్డి, ఎంపీపీ బొల్లం జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్‌ విరిగినేని అంజయ్య, వైస్‌ ఎంపీపీ బైరెడ్డి వెంకటరెడ్డి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, మెరుగు రామలింగం, యుగంధర్‌రెడ్డి, గడ్డం సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు

మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే భగత్‌ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ఆలయ పాలక మండలి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్‌ విరిగినేని అంజయ్య, తాటి సత్యపాల్‌, మెరుగు రామలింగయ్య, బొలల రవి, శ్రీనివాసరావు, రాంబాబు లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



నారమ్మగూడెంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భగత్‌

సంక్షిప్త సమాచారం

ప్రధాన కార్యదర్శిగా మహేష్‌యాదవ్‌

మిర్యాలగూడ టౌన్‌: బీసీ యువజన సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్‌ గ్రామానికి చెందిన చింతల మహేష్‌యాదవ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ చేతుల మీదుగా ఆయన నియమక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మహేష్‌గౌడ్‌, మురళీయాదవ్‌, జయరాజ్‌, వెంకటయ్య, అంజయ్య, సత్యం తదితరులున్నారు.

దళితులను చిన్నచూపు తగదు

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం దళితులను చిన్నచూపు చూస్తూ అవమానాలకు గురి చేస్తుందని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి విజయ్‌, ఎస్సీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు చందాల సందానందం ఆరోపించారు. బుధవారం వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు శివశరణ్‌నాయక్‌, ఎస్సీ సెల్‌ నాయకులు తాళ్లపల్లి దావీద్‌ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో 9304 దరఖాస్తులు

మిర్యాలగూడ టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 48వార్డుల నుంచి ఇప్పటివరకు 9304మంది లబ్ధిదారులు డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ రవీందర్‌సాగర్‌ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ 1442 మంది, 20వ తేదీన 2915 మంది, 21వ తేదీన 2817 మంది, 22వ తేదీన 2130 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం దరఖాస్తు చేసుకునేందుకు చివరి రోజు కావడంతో ఆయా వార్డుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

చందంపేట: మండలంలోని చిత్రియాల గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం రైతు సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ రంగయ్య, రాములుగౌడ్‌, సత్యనారాయణ, రామలింగం, వెంకటయ్య, పోశం శ్రీను, రజని తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం

కొండమల్లేపల్లి: మండలంలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని జేత్యతండాకు 2.1 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ.1.17కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం గ్రామంలో సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నానునాయక్‌, రమావత్‌ దస్రూనాయక్‌, కేసాని లింగారెడ్డి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ఫెలోషిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: స్వేరో ఫెలోషిప్‌ను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్వేరో స్టూడెంట్స్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌ ముదిగొండ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ నుంచి పీజీ వరకు, ప్రొఫెషనల్‌ కోర్సులు చదువుతున్న విద్యార్థులు స్వేరో ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. స్వేరోస్‌ వెబ్‌సైట్‌ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్‌ చేసుకుని మెయిల్‌ చేయాలని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

కొండమల్లేపల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని పార్టీ రాష్ట్ర నాయకుడు గార్లపాటి జితేందర్‌ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్‌ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతుందని అన్నారు. సమావేశంలో బజర్పుల కళ్యాణ్‌నాయక్‌, వినోద్‌ రాథోడ్‌, బొడిగె సాంబశివగౌడ్‌, పేర్ల జితేందర్‌ పాల్గొన్నారు.